నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, సోమవారం 24 మార్చి 2025 | BHADRADRI KOTHAGUDEM


ఇల్లెందు పీఎస్‌లో ఎండీఎం వర్కర్లు..

## ‘ఆశా’, ‘మధ్యాహ్న’ కార్మికుల ముందస్తు అరెస్టులు


తమ సమస్యలను పరిష్కరించాలని, హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటోంది. ఎన్నికల హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీకి, ఇందిరాపార్కు వద్ద ధర్నాకు బయలుదేరిన ఇల్లెందు, దమ్మపేట మండలాలకు చెందిన ఆశా కార్యకర్తలను, మధ్యాహ్న భోజన కార్మికులను, సీఐటీయూ నాయకులను ఆదివారం ఉదయమే పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్లకు తరలించారు.

–ఇల్లెందు/ దమ్మపేట, మార్చి 23


దమ్మపేట పీఎస్‌లో ఆశా కార్యకర్తలు

## ‘ఆశ్రమ’ హాస్టల్లో అగ్నిప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో స్టోర్ రూంలో పరుపులు, క్రీడాసామగ్రికి మంటలు
- పొగలను గుర్తించి బయటకు పరుగులు తీసిన 230 మంది విద్యార్థులు
- ములకలపల్లి మండలం కమలాపురం ఆశ్రమ వసతిగృహంలో ఘటన


హాస్టల్ స్టోర్ రూంలో ఎగిసి పడుతున్న మంటలు

ములకలపల్లి, మార్చి 23: ములకలపల్లి మండలం కమలాపురంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల వసతిగృహంలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. ఉదయం పది గంటల సమయంలో స్టోర్ రూంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు అంటుకున్నాయి. మిగతా రూములకు పొగ వ్యాపించింది. దీనిని గమనించిన విద్యార్థులు భయంతో వసతిగృహం నుంచి ఆవరణలోని చెట్ల కిందకు పరుగులు తీశారు. ఆదివారం సెలవు దినం కావడంతో మొత్తం 230 మంది విద్యార్థులూ వసతిగృహంలోనే ఉన్నారు. ఇటీవల వీరికి కొత్తగా పరుపులు వచ్చాయి. దీంతో పాత పరుపులను తీసుకెళ్లి సెకండ్ ఫ్లోర్‌లోని స్టోర్ రూమ్‌లో ఉంచారు. అదే రూంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో పరుపులకు మంటలు అంటుకున్నాయి. అక్కడే ఉన్న క్రీడాసామగ్రి, పరుపులు అగ్నికి ఆహుతయ్యాయి. మూడు నాలుగు గంటలు గడిచినా అదుపులోకి రాలేదు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై రాజశేఖర్ తన సిబ్బందితో చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది కూడా వచ్చి మంటలను ఆర్పారు. అయితే, ప్రమాదం రాత్రివేళ సంభవించి ఉంటే తీవ్రత ప్రమాదకరంగా ఉండేదని, ప్రాణనష్టం కూడా పెద్ద ఎత్తున జరిగి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం పది గంటల సమయంలో స్టోర్ రూమ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో విద్యార్థులను అప్రమత్తం చేసి వెంటనే బయటకు పంపామని వసతిగృహం వార్డెన్ నాగప్రత్యూష తెలిపారు. ప్రమాద సమయంలో ఆ రూమ్‌లో ఉన్న 300 పాత పరుపులు, క్రీడాసామగ్రి ఉన్నట్లు చెప్పారు.


వసతిగృహం నుంచి బయటకు వచ్చి ఆవరణలో చెట్టు కింద కూర్చున్న విద్యార్థులు

- పదిహేను నెలలుగా ఊరిస్తున్న కాంగ్రెస్ సర్కార్
- దరఖాస్తుల మీద దరఖాస్తులు పెట్టిస్తున్న వైనం
- పాతకార్డులో పేర్లు వెంటనే తొలగింపు.. బియ్యం కట్
- కొత్త కార్డులు లేవు... పిల్లల పేర్లు యాడింగ్ లేదు
- ఆశగా ఎదురుచూస్తున్న నిరుపేదలు
- కనుచూపు మేరలో కానరాని కొత్తకార్డుల జాడ
- మీ సేవా దరఖాస్తులు 6,717, ప్రజాపాలనలో 66,115



# పరుగో పరుగు..

## రేషన్‌కార్డుల కోసం పేదల అవస్థలు

**కొత్త రేషన్‌కార్డుల కోసం పేదలు పడుతున్న బాధలు అన్నీఇన్నీ కావు.. అధికారంలోకి రాగానే కాంగ్రెస్ సర్కార్ నిర్వహించిన ప్రజాపాలన సభల్లో నెట్టుకుంటూ వెళ్లి మరీ దరఖాస్తులు చేసుకున్నారు. కార్డులు వస్తాయని నమ్మారు.. కానీ రాలేదు. మళ్లీ ఇంటింటి సర్వేకు వచ్చి కుటుంబ సభ్యులందరి వివరాలు చెప్పమన్నారు.. చెప్పారు. ఇక కొత్తకార్డులు వచ్చినట్లే అనుకున్నారు. లేదు మళ్లీ మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో అక్కడికీ పరుగులు పెట్టారు. అయితే పాతకార్డులో పేర్లు తొలగించుకుంటేనే దరఖాస్తు చేసేందుకు వీలవుతుందని నిర్వాహకులు చెప్పడంతో.. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయాలకు ఒక్క పరుగు తీశారు.. పేర్లు తొలగించుకున్నారు. అత్తగారి ఇండ్లకు వెళ్లి వారి రేషన్‌కార్డులో భార్యల పేర్లను కూడా అక్కడి తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి తొలగించుకున్నారు. తర్వాత మీ సేవ కేంద్రాలకు వెళ్లి తమ పిల్లల పేర్లతో సహ దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఉరుకుల పరుగులు పదిహేను నెలలుగా జరుగుతున్న తంతు. కానీ కొత్త రేషన్‌కార్డుల జాడ కనుచూపు మేరలో కూడా కనిపించడం లేదు. ఎప్పుడొస్తాయో కూడా తెలియకుండా కొత్తకార్డుల కోసం నిరుపేదలు వేయికండ్లతో ఎదురుచూస్తున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్‌కార్డులు ఇస్తామని చెప్పి ఇంతవరకూ ఇవ్వకుండా పేదలను చాలా ఇబ్బంది పెడుతున్నదని బాహాటంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా తమ పేదరికాన్ని అలుసుగా తీసుకోకుండా ప్రభుత్వం వెంటనే కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.**

– ఖమ్మం, మార్చి 23

ఖమ్మం నగరంలోని 25వ డివిజన్‌కు చెందిన ఆర్.సీతారాములుకు ముగ్గురు పిల్లలు. వారిలో ఇద్దరు కుమారులకు 8 ఏండ్ల క్రితం వివాహాలు జరిగాయి. వారిద్దరికి ఇద్దరేసి చొప్పున పిల్లలు ఉన్నారు. రోజువారి పనులకు వెళ్లే కుటుంబం వారిది. ఐతే చాలా సంవత్సరాల నుంచి వారి రేషన్‌కార్డులో ఐదుగురు సభ్యులు ఉన్నారు. కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఐదునెలల క్రితం మీ సేవా కేంద్రానికి వెళ్తే మీరు ఉన్న రేషన్‌కార్డులో మీ పేర్లు తొలగించుకుంటే కొత్త కార్డుకు దరఖాస్తు చేసుకునే వీలు ఉంటుందని చెప్పడంతో వారిరువురు అన్నదమ్ములు ఐదునెలల క్రితం ఖమ్మంఅర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి పేర్లు డిలిట్ చేయించుకున్నారు. దరఖాస్తు చేసుకోవడానికి తిరిగి మీ సేవకు వెళ్తే మీ ఒక్కరేదే కాదు మీ భార్యల పేర్లు కూడా ఇదే మాదిరిగా మీ అత్తగారి కార్డు నుంచి తొలిగించుకోవాలని చెప్పారు. దీంతో హుటాహుటిన వారి అత్తగారి ఊర్లైన వరంగల్ జిల్లాకు ఒకరు, నల్గొండ జిల్లాకు మరొకరు వెళ్లి అక్కడ తహసీల్దార్ కార్యాలయాల్లో వారి భార్యల పేర్లను రేషన్‌కార్డుల నుంచి డిలిట్ చేయించుకొని వచ్చారు. ఖమ్మంలోని మీ సేవలో వారి భార్యలు, పిల్లల ఆధార్‌కార్డులు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జత చేసి దరఖాస్తు చేశారు.. ఇది జరిగి సుమారు ఐదునెలలు అవుతున్నది.. కానీ ఇంతవరకు కొత్త రేషన్‌కార్డు రాలేదు. అప్పటివరకు వారికి 30కిలోల బియ్యం ప్రతి నెలా వచ్చేవి. అవి కాస్త 18 కిలోలకు తగ్గాయి. ఇదే మాదిరిగా వారి అత్తగారి కార్డులో కూడా ఆరు కిలోల చొప్పున బియ్యం తగ్గాయి. కాని ఇంతవరకు కొత్త కార్డు రాలేదు. కనీసం ఏ అధికారి కూడా విచారణకు వచ్చింది లేదు. కార్డు వస్తుందో, రాదో కూడా తెలియదు. కొత్తకార్డు ఏమో కానీ ఉన్న బియ్యం పోయాయని బాధ పడుతున్నారు.

బోనకల్‌కు చెందిన రమేశ్‌కు 11ఏండ్ల క్రితం వివాహం జరిగింది. కూతురు, కుమారుడు ఉన్నారు. రేషన్‌కార్డులో రమేశ్, అతడి భార్య పద్మ మాత్రమే ఉన్నారు. వారి పిల్లలకు 10 ఏండ్లు ఒకరికి, 8 ఏండ్లు ఒకరికి వచ్చాయి. వారి రేషన్‌కార్డులో పిల్లల పేర్లు చేర్చడానికి 10 నెలల క్రితం మీ సేవా కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేశారు. అప్పుడు మీ సేవ నిర్వాహకులు స్లిప్ ఇచ్చారు.. అయితే ఇంతవరకూ పిల్లల పేర్లు కార్డులో యాడ్ కాకపోవడంతో మీ సేవకు వెళ్లి మరో సారి దరఖాస్తు చేయడానికి ప్రయత్నించారు. కాగా ఇంతక ముందే మీరు దరఖాస్తు చేశారు.. ఆ స్లిప్ తెస్తే మీ స్టేటస్ చెబుతామని మీ సేవ అతను చెప్పడంతో ఇంటికి వెళ్లి ఎంత వెదికినా ఆ స్లిప్ దొరకలేదు.. తిరిగి దరఖాస్తు చేయడానికీ వీలుకావడం లేదు.. ఏమిచేయలేక ఆందోళన చెందుతున్నారు. ఇది ఒక్క సీతరాములు, రమేశ్ బాధలు మాత్రమే కాదు.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొన్ని వేల మంది నిరుపేదలు పడుతున్న బాధలు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలవుతున్నది. అధికారంలోకి రాగానే కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని హామీ ఇచ్చారు.. కానీ ఇంతవరకు ఒక్క కొత్తకార్డు కూడా ఇవ్వలేదు. కనీసం పిల్లల పేర్లు సైతం చేర్చడం లేదు. కొత్త కార్డుల కోసం, పిల్లల పేర్లు యాడ్ చేయడం కోసం వేల సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు.. వారందరి పరిస్థితి ఇదే. ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటన చేయడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన రెట్టింపు అయ్యింది.

### డిలీట్ ఆప్షన్ మాత్రమే ఉంది..

రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల్లో రేషన్‌కార్డులోని పేరు తొలగింపునకు మాత్రం తహసీల్దార్ కార్యాలయాల్లో ఆప్షన్ ఉంది. కానీ యాడింగ్ మాత్రం కార్యాలయ సిబ్బందికి ఇవ్వలేదు.. కనీసం కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు తహసీల్దార్ వద్ద లేవు. విచారణ చేయడానికి ఏ స్థాయిలో ఉందో కూడా తెలియట్లేదని సిబ్బంది చెబుతున్నారు. ఇదిలా ఉండగా కొత్త కార్డులు రాక, పిల్లల పేర్లు యాడ్ కాక తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ జనం తిరుగుతున్నారు. రేషన్‌కార్డు నుంచి తమ పేరును డిలీట్ చేయమని తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు ఇచ్చిన గంటలోనే కార్డులో పేరు తొలిగిస్తున్నారు.. కానీ యాడింగ్ చేసే అధికారం కూడా తహసీల్దార్ సిబ్బందికి ఇస్తే సమస్యలు రావని దరఖాస్తుదారులు పేర్కొంటున్నారు.

### మీ సేవా ద్వారా వచ్చిన దరఖాస్తులు..

ఖమ్మంఅర్బన్ 1,505, నేలకొండపల్లి 478, చింతకాని 467, ఖమ్మంరూరల్ 418, కొణిజర్ల 378, ముదిగొండ 376, కల్లూరు 365, బోనకల్ 325, తల్లాడ 275, సింగరేణి 272, మధిర 263, రఘునాధపాలెం 245, వైరా 233, కామేపల్లి 210, సత్తుపల్లి 185, కూసుమంచి 174, వేంసూరు 154, పెనుబల్లి 150, తిరుమలాయపాలెం 110, ఏన్కూరు 76, ఎర్రుపాలెం 56 మొత్తం ఖమ్మం జిల్లాలో 6,717 దరఖాస్తులు మీ సేవా కేంద్రాల ద్వారా కొత్తకార్డుల కోసం చేసుకున్నారు. వీటికి సంబంధించి కుటుంబ సభ్యులు 19,867 మంది ఉన్నారు. ఇవన్నీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లాగిన్‌లో పెండింగ్‌లో చూపిస్తున్నవి. ఇవి ఇలా ఉండగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టిన ఆరు పథకాలకు సంబంధించి స్వీకరించిన వాటిలో రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలన గ్రామసభల్లో 66,115 దరఖాస్తులు వచ్చాయి.



### కొత్త కార్డులు వెంటనే ఇవ్వాలి

కొత్త రేషన్‌కార్డు కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకొని చాలాకాలం అవుతున్నది. ఇంతవరకు కార్డు రాలేదు. సన్నబియ్యం ఇస్తామని అంటున్నారు. అవి మాకు వద్దా.. రేవంత్‌రెడ్డి గద్దెనెక్కగానే కొత్త కార్డులు ఇస్తానన్నాడు.. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నది. ఇంతవరకు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదు. దయచేసి వెంటనే కొత్తకార్డులు ఇవ్వాలి.

– ఎస్‌కే రజియా, ఖమ్మం



### మీ సేవకు వెళ్తే.. తెలియదంటున్నారు

కొత్త రేషన్‌కార్డు కోసం మీ సేవకు వెళ్లి దరఖాస్తు చేసి సంవత్సరం అవుతున్నది. ఈ మధ్యన వెళ్లి అడిగితే మాకు ఏమీ తెలియదు.. తహసీల్దార్ ఆఫీస్‌కు వెళ్లి కనుక్కోమన్నారు. అక్కడకు వెళ్లి అడిగితే మీ సేవలో దరఖాస్తు చేశారుగా వస్తుందిలే వెళ్లు అన్నారు. కానీ ఇంతవరకు రాలేదు. మళ్లీ మీ సేవలో దరఖాస్తు చేయాలంటున్నారు.

– రుడావత్ సుమ, ఖమ్మం



### కనీసం పిల్లల పేర్లు యాడ్ చేయండి..


మాకు ఇద్దరు పిల్లలు. మా రేషన్‌కార్డులో వారి పేర్లను యాడ్ చేయడానికి మీ సేవకు వెళ్లి దరఖాస్తు చేశాను.. ఇంతవరకు పేర్లు యాడ్ కాలేదు. డీలర్‌ను అడిగితే ఇంకా రాలేదు.. వస్తాయి అంటున్నాడు... మేము నలుగురం ఉన్నా ఇద్దరికే బియ్యం వస్తున్నవి. ప్రభుత్వం కనీసం కొత్తకార్డులు ఇవ్వకపోయినా పిల్లల పేర్లు యాడ్ చేసినా బాగుండేది.

– కమ్మం అశ్విని, ఖమ్మం

# భగీరథ అరకొర

- దమ్మాయిగూడెంలో తాగునీటి కొరత
- ఊరు చివరి బావి ద్వారా సరఫరా
- చర్మవ్యాధులతో బాధ పడుతున్న గ్రామస్తులు


దమ్మాయిగూడెంలో నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు


దమ్మాయిగూడెంలో పైకప్పు లేని గేటువాల్ డమ్మి

తిరుమలాయపాలెం, మార్చి 23: మండల పరిధిలోని దమ్మాయిగూడెంలో ‘మిషన్ భగీరథ’ నీరు పూర్తిస్థాయిలో అందడం లేదు.. దీంతో గ్రామంలోని ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడింది. దమ్మాయిగూడెంలో ఉన్న సంపు ద్వారానే పలు గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగుతున్నప్పటికీ తమ గ్రామానికి మాత్రం అరకొరగా సరఫరా ఉందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు సరిపోకపోవడంతో అధికారులు ఊరుబయట ఉన్న మంచినీటి బావి ద్వారా గ్రామానికి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. చాలాకాలంగా నిరుపయోగంగా ఉన్న బావి నుంచి నీటిని సరఫరా చేస్తుండడంతో పలువురి చర్మంపై దురద, దద్దుర్లు వస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో గేటువాల్స్, ఎయిర్ వాల్వ్‌కు పైకప్పులు లేకపోవడంతో దుమ్ముధూళి పడి నీరు కలుషితంగా మారుతున్నది. ఇప్పటికైనా అధికారులు మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన నీటిని గ్రామానికి సరఫరా చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్‌కే ఖలీల్‌ను వివరణ కోరగా మిషన్ భగీరథ నీటి కొరత వల్ల బావి నుంచి నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల విజ్ఞప్తి మేరకు ఎంపీడీవో శిలార్ సాహెబ్ ఆధ్వర్యంలో బావి నీటిని పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపించినట్లు వివరించారు.


### గత పదేళ్లు నీటికొరత లేదు..



గడిచిన పదేళ్లు మాకు మిషన్ భగీరథ ద్వారా నిరంతరం తాగునీరు వచ్చింది. నీటికొరత ఉండేది కాదు.. ఇప్పుడు చెరువు వద్ద ఉన్న బావి నుంచి సరఫరా ఇస్తున్నారు. చాలా ఏండ్లు ఆ బావి పడావుబడినందున ఆ నీళ్లతో అనేకమందికి చర్మంపై దురద వస్తున్నది. మా ఊరు నుంచే అన్ని ఊర్లకు మిషన్ భగీరథ నీళ్లు పోతయి. మా ఊరుకి మాత్రం నీళ్లు రావడం లేదు.

– పల్లి రాధమ్మ, దమ్మాయిగూడెం

### చర్మవ్యాధులు వస్తున్నయ్..



బావి నీటితో చర్మవ్యాధులు వస్తున్నాయి. మాకు మిషన్ భగీరథ నీళ్లను మాత్రమే సరఫరా చేయాలని పంచాయతీ సెక్రటరీని అడిగితే మీ ఇద్దరు ముగ్గురికి మాత్రమే దురద వస్తుంది? అందరూ అంటేనే మిషన్ భగీరథ నీళ్లు ఇస్తామని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. అనేకమందికి ఆ నీటితో దురద వస్తున్న మాట వాస్తవం. ఉన్నతాధికారులు వెంటనే పట్టించుకోవాలి. మండల అధికారులకు ఇప్పటికే ఫిర్యాదు చేశాం.

– ఎస్‌కే లాల్‌బీ, దమ్మాయిగూడెం


నమాజు ఆచరిస్తున్న అజయ్


కర్జూరా తినిపిస్తున్న సండ్ర


నమాజులో పాల్గొన్న రేగా

## ప్రవక్త బోధనలు అనుసరణీయం

**ఇఫ్తార్ విందుల్లో మాజీ మంత్రి అజయ్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, రేగా కాంతారావు**

మహ్మద్ ప్రవక్త బోధనలను నేటి సమాజంలో అనుసరణీయమైనవని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పేర్కొన్నారు. రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా ఖమ్మం కాల్వొడ్డు మోతి మస్జీద్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి నమాజు ఆచరించారు. సత్తుపల్లి ఎన్టీఆర్‌నగర్ మసీదు, రాజీవ్‌నగర్ మసీదుల్లో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య.. ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. సింగరేణి కార్మిక నాయకుడు ఊకంటి ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో మణుగూరు బాంబే కాలనీ మహ్మదీయ మసీదులో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పాల్గొన్నారు.

–ఖమ్మం/ సత్తుపల్లి టౌన్/ మణుగూరు టౌన్, మార్చి 23

## 17 ఏళ్ల బాలిక ఆత్మహత్యాయత్నం

- ఆమెపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడి గర్భవతిని చేసిన యువకుడు
- అతడిపై చర్యలు తీసుకోవాలని మైనర్ కుటుంబీకులు, గ్రామస్తుల డిమాండ్
- ఐదారు రోజులుగా ఫిర్యాదు తీసుకోని ఎర్రుపాలెం పోలీసులు
- ‘పెద్దల’ ఒత్తిడితో ఎస్ఐ నిందితుడి పక్షాన నిలుస్తున్నారంటూ ఆరోపణ
- ఫిర్యాదు తీసుకోకపోవడంతో ట్యాంకు ఎక్కి దూకబోయిన బాలిక
- పలు దఫాలుగా గ్రామస్తుల రాస్తారోకో, పీఎస్ ఎదుట ఆందోళన


ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఆందోళన చేస్తున్న బాధితురాలి బంధువులు, గ్రామస్తులు

ఎర్రుపాలెం, మార్చి 23: ఎర్రుపాలెం మండలంలో ఆదివారం ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసులు తనకు న్యాయం చేయడం లేదని, నిందితుడి పక్షాన నిలుస్తున్నారనే మనోవేదనతో బాధిత బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఫిర్యాదు తీసుకునేందుకు ఎస్ఐ నిరాకరించడంతో బాధిత బాలిక కుటుంబీకులు, గ్రామస్తులు పలు దఫాలుగా రాస్తారోకో చేశారు. పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించారు. గ్రామస్తులు, బాధిత బాలిక కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం భీమవరం హరిజనవాడకు చెందిన బాలిక (17)పై అదే గ్రామానికి చెందిన 27 ఏళ్ల యువకుడు పలుమార్లు లైంగికదాడికి పాల్పడడంతో ఆమె గర్భం దాల్చింది. అయితే, ఆ యువకుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేసేందుకు గ్రామస్తులు, కుటుంబ సభ్యులతో కలిసి బాధిత బాలిక ఐదారు రోజుల క్రితం ఎర్రుపాలెం పోలీసు స్టేషన్‌కు వెళ్లింది. ఆమె ఫిర్యాదును తీసుకునేందుకు స్థానిక ఎస్సై వెంకటేశ్ నిరాకరించారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు శనివారం ఖమ్మం జిల్లా కేంద్రానికి వెళ్లి పోలీసు కమిషనర్‌ను కలిశారు. స్థానిక ఎస్ఐ తమ ఫిర్యాదును తీసుకోవడంలేదనే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మళ్లీ ఆదివారం వెళ్లి ఫిర్యాదు చేయబోయినా ఎస్ఐ తీసుకోలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలిసి పలు దఫాలుగా రహదారిపై రాస్తారోకో చేశారు. పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిందితుడిని కాపాడేందుకు అతడికి దగ్గరి వారైన ఓ మాజీ ప్రజాప్రతినిధి, పోలీసు అధికారుల ఒత్తిడితోనే స్థానిక ఎస్ఐ తమ ఫిర్యాదు తీసుకోవడం లేదని ఆరోపించారు. నిందితుడి తరపు వాళ్లు సృష్టించి తెచ్చిన నకిలీ జనన ధ్రువపత్రాలతో కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అయినప్పటికీ పోలీసులు స్పందించకపోవడంతో మనోవేదన చెందిన బాలిక వెంటనే సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకు ఎక్కి దూకబోయింది. వెంటనే బాలిక సోదరుడు, స్థానిక పోలీసు సిబ్బంది వెళ్లి ఆమెను అడ్డుకున్నారు. అనంతరం కేసు నమోదు చేస్తానని ఎస్సై హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. తరువాత పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.